క్లుప్తంగా

నూకాంబిక ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


ఆలయ చైర్మన్, ఈవోలకు చెక్కు అందిస్తున్న సుధీర్, హేమలత దంపతులు

అనకాపల్లి టౌన్: సీతమ్మధారకు చెందిన క్రిన్‌దా ఫ్యాషన్స్ అధినేత సిగటాపు సుధీర్, హేమలత దంపతులు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణ నిమిత్తం రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లకు వారు బుధవారం చెక్కును అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈవోలు మాట్లాడుతూ ఇప్పటి వరకు విరాళంగా రూ.30 లక్షలు వచ్చినట్లు చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: ఎస్ఎస్‌టీఎల్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 24న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ(ఆపరేషన్స్) బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని స్కూల్, పోలీస్ క్వార్టర్స్, పీఎఫ్ క్వార్టర్స్, లీడర్ కార్యాలయ ప్రాంతం, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, మర్రిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్ నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్ నగర్, రైల్వే క్వార్టర్స్, నరేంద్రనగర్, ఓల్డ్ కరాస, న్యూ కరాస, శాంతినగర్, అంబేద్కర్ నగర్ కాలనీ, నేతాజీ కాలనీ, రామ్‌నగర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఎన్ఏడీ–1 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


నక్కవానిపాలెంలో రోడ్డు విస్తరణ పనులు చేయిస్తున్న అధికారులు


సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సత్యం జంక్షన్ నుంచి అల్లూరి సీతారామరాజు కూడలి వరకు ఇప్పటికే రహదారిని ఇరువైపులా విస్తరించి కాలువ పనులు పూర్తి చేశారు. కల్వర్టులపై కప్పులు వేస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుని దగ్గరుండి పనులు జరిపిస్తున్నారు.

త్వరలో 108 సిబ్బందికి యూనిఫారం


అరబిందో ఆపరేషనల్ హెడ్ గంగాధర్‌ను సన్మానిస్తున్న 108 అధికారులు, సిబ్బంది

మహారాణిపేట : అరబిందో ఆధ్వర్యంలో నడుస్తున్న 108, 104 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సిబ్బందికి త్వరలో యూనిఫారం వస్తుందని ఆపరేషనల్ హెడ్ గంగాధర్ స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాల వాహనాల సిబ్బందితో బుధవారం సమీక్షించారు. క్షతగాత్రులను సకాలంలో రక్షించి ప్రాణాపాయం లేకుండా చూడాలని, త్వరలో మరిన్ని కొత్త వాహనాలు వస్తున్నాయని తెలిపారు. రోగుల వద్ద డబ్బులు తీసుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ త్రినాథరావు, సిటీ కోఆర్డినేటర్ ఎం.సురేష్, ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, 104 డీఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు



45వ వార్డు రామచంద్రనగర్‌లోని 255 సచివాలయం

ఒకప్పుడు సంక్షేమ పథకాలు, సేవలు, ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. పింఛన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ ఇలా ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందాలన్నా ఎన్నో నెలల పాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రజలు ఎదుర్కొన్న ఈ కష్టాలకు, టీడీపీ అవినీతి, అసమర్థ పాలనకు చరమగీతం పాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పరిపాలనను తీసుకొచ్చారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందజేస్తున్నారు.

వార్డు నంబర్ : 45
మొత్తం సచివాలయాలు : 05
మొత్తం జనాభా : 14,396 మంది
సచివాలయాల ఉద్యోగులు : 33
సేవలందిస్తున్న వలంటీర్లు : 91

- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు
- పారదర్శకంగా.. వేగవంతంగా లబ్ధిదారులకు సేవలు
- కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు
- గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన వైఎస్సార్‌సీపీ సర్కార్

తాటిచెట్లపాలెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు ముంగిట్లోనే అందుతున్నాయి. దీంతో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, విద్యార్థులు, వ్యాపారులు ఇలా లబ్ధిదారులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సేవలను చేరువ చేయడం, వేగవంతంగా సేవలను అందుకోవడం గతంలో ఎన్నడూ చూడలేదని సీఎం వైఎస్ జగన్ పాలనను కొనియాడుతున్నారు. సచివాలయాల్లో లభించే ప్రతి సేవ ఉచితంగా, పారదర్శకంగా, పార్టీలు, వర్గాలకు అతీతంగా అందుతున్నాయి.

45వ వార్డులో సచివాలయాల స్వరూపం

- జీవీఎంసీ 45వ వార్డులో 252, 253, 254, 255, 256 మొత్తం ఐదు సచివాలయాలు ఉన్నాయి. పది మంది సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.
- 252 సచివాలయం తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ వెనుక గణేషనగర్‌లో ఉంది. నరసింహనగర్ పార్ట్, గణేష్‌నగర్ పార్ట్, వరాహగిరి కాలనీ పార్ట్‌లకు చెందిన సుమారు 973 ఇళ్లు దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 2,745 మంది ప్రజలు సేవలు పొందుతున్నారు.
- 253 సచివాలయం కైలాసపురం రోడ్డులోని జోసఫ్ చర్చ్ వెనుక ఉంది. సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ పార్ట్, సింహగిరి కాలనీలకు చెందిన 1,034 గృహాలు దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 2,880 మంది ప్రజలు సేవలు పొందుతున్నారు.
- 254 సచివాలయం కైలాసపురం రోడ్డులోని జోసఫ్ చర్చ్ వెనుక ఉంది. సింగాలమ్మపురం, లక్ష్మీ నారాయణపురం–1, 2లకు చెందిన 973గృహాలు దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 2,860 మంది ప్రజలు సేవలు పొందుతున్నారు.
- 255 సచివాలయం తాటిచెట్లపాలెం హైవేలోని రేమా బ్లెస్సింగ్ చర్చ్ పక్కన ఉంది. ఏఎస్సార్ నగర్, సంతోషిమాత కాలనీ, చిట్టిబాబు కాలనీ, సోనియాగాంధీ నగర్, రామచంద్రనగర్, ప్రశాంతినగర్‌కు చెందిన 1,178 గృహాలు దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 3,247 మంది ప్రజలు సేవలు పొందుతున్నారు.
- 256 సచివాలయం తాటిచెట్లపాలెం హైవే పక్కన గల వాసుదేవనగర్‌లో ఉంది. వాసుదేవనగర్, వైఎస్సార్ నగర్, గణేష్ కాలనీ, తాటిచెట్లపాలెం బజార్ ప్రాంతాలకు చెందిన 596 గృహాలు దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 2,664 మంది ప్రజలు సేవలు పొందుతున్నారు.


వాసుదేవనగర్ సచివాలయంలో నూతన పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

ప్రజలకు అందుతున్న సేవలు

వార్డుల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలు అనేక రకాల సేవలు పొందుతున్నారు.

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పోలీస్, సివిల్ సప్లయిస్, రవాణా, విద్య, ఎస్పీడీసీఎల్, పరిశ్రమలు కార్మిక, మైనింగ్, అగ్రికల్చర్, ఎలక్షన్, సాంఘిక సంక్షేమ, ఆరోగ్య, పాఠశాల విద్య, ఏపీఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, గ్రామీణాభివృద్ధి, కో ఆపరేటివ్ సొసైటీ, సాంకేతిక విద్య, మైనారిటీ సంక్షేమం, ఇంటర్మీడియట్ విద్య, ఆరోగ్యశ్రీ, కళాశాల విద్య, పంచాయతీరాజ్ ఇలా అనేక శాఖలకు సంబంధించిన సేవలన్నీ నేడు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.
- ఈ శాఖల ద్వారా ఆదాయ, నివాస, కుల, ధ్రువ పత్రాలు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, పేదల ఇళ్లు, విద్యుత్ బిల్లులు, మునిసిపల్ పన్నులు, వివిధ శాఖలకు సంబంధించి ఫిర్యాదులు, పింఛన్లు మంజూరు, ఇలా ఏ ప్రభుత్వ పథకమైన సచివాలయాల వద్ద ప్రజలకు లభిస్తున్నాయి.
- ప్రభుత్వ పథకాలు, ప్రజల ఆరోగ్య, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలపై శానిటేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు ఆయా సమయాల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహిస్తున్నారు.


వాసుదేవనగర్ 256 సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సెక్రటరీలు

సచివాలయాలతో చేరువైన సేవలు



మాకు అమ్మ ఒడి వస్తుంది. ఈ పథకం కోసం కావలసిన అన్ని పత్రాలు వలంటీర్లే సిద్ధపరచి సచివాలయం ద్వారా లబ్ధి చేకూరేలా చేశారు. గతంలో ఇటువంటి వాటి కోసం చాలా సార్లు, చాలామంది చుట్టూ తిరిగేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక అన్ని సేవలు మాకు చేరువగా వచ్చాయి.

– డి.శ్రీదేవి, వాసుదేవనగర్, 256 సచివాలయం

ప్రతి కుటుంబానికీ మేలు



పెన్షన్, వైఎస్సార్ చేయూత, టిడ్కో ఇళ్లు, ఆసరా వంటి పథకాలు ఈ ప్రభుత్వ హయాంలో సచివాలయం ద్వారా అందుకుంటున్నారు. నాకు, నా కుటుంబానికి చాలా మేలు జరిగింది. ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వలంటీర్లే ఇంటికి వచ్చి అన్ని వివరాలు నమోదు చేసుకుని పథకాలు మంజూరు చేయిస్తున్నారు.

– గెద్దం కోటమ్మ, ఏఎస్సార్ నగర్, 255 సచివాలయం

పారదర్శకంగా సీఎం పాలన



నా భర్తకు వాహనమిత్ర పథకం, నాకు చేయూత, మా పాపకు దివ్యాంగ్ పింఛన్ వస్తుంది. ఇవన్నీ కూడా కేవలం సచివాలయం, వలంటీర్ వ్యవస్థ వల్లే సాధ్యమైంది. ఎవరికీ ఎటువంటి సిఫార్సులు, లంచాలు లేకుండా మా డబ్బులు మా ఖాతాల్లోనే పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిపెట్టిన సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది.

– బాద జయమ్మ, సంతోషిమాత కాలనీ, 255 సచివాలయం

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం


బూత్ ఏజెంట్లకు సూచనలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 49, 50, 51 వార్డులకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లతో బుధవారం బుధవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు సంబంధించి ఏజెంట్లకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, సారిపల్లి గోవింద్, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టార్, జేసీఎస్ మండల కన్వీనర్లు అమర్‌రెడ్డి, నీలి రవి పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల్లో భద్రతపై సెమినార్


మాట్లాడుతున్న గెస్ట్ ఫ్యాకల్టీ

మురళీనగర్: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం రసాయన పరిశ్రమల్లో భద్రతపై లాస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జనరల్ మేనేజర్(ప్రాజెక్ట్ సేఫ్టీ) డా ఎ.ఎ.గిరినాథన్ గెస్ట్ ఫ్యాకల్టీగా మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమల్లో తీసుకోవలసిన భద్రతల గురించి వివరించారు. పరిశ్రమల్లో అనుసరించాల్సిన కేస్ స్టడీస్, ప్రమాదాలను నివారించే పలు పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఎ.వరహాలు, కెమికల్ ఇంజినీరింగ్ లాస్ట్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎంఈఎస్ ఆల్ పెన్షనర్స్' నూతన కమిటీ ఎన్నిక


విజయప్రసాద్


డాక్టర్ జాకబ్


లక్ష్మణరావు

విశాఖ విద్య: మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ఆల్ కేడర్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్ఏడీ కూడలిలోని మర్రిపాలెం వాకింగ్ పార్కులో బుధవారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కందుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా చెటికం విజయప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కండిపిల్లి నూకరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. కనకారావు, సి.టి.రెడ్డి, శివరావు, రఘునాథ్, ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వారా జాకబ్, కోశాధికారిగా ధవళ లక్ష్మణరావును ఎన్నుకున్నారు. ఆడిటర్ కమ్ అడ్వైజర్‌గా కాకి సత్యారావు, లీగల్ అడ్వైజర్‌గా పి. లక్ష్మణమూర్తిని ఎంపిక చేసుకున్నారు. జాయింట్ సెక్రటరీగా ఎ. మోహన్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పులి సత్యనారాయణతో పాటు పలువురు కార్యవర్గంలో చోటు కల్పించారు. పెన్షనర్ల సమస్యలపై నూతన కమిటీ కృషి కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని నిర్ణయించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: గంభీరం, హనుమంతువాక కూడళ్లలో ఆటో డ్రైవర్లకు బుధవారం రహదారి నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక బృందాలు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 8 ఆటోలపై కేసులు నమోదు చేశా రు. మోటార్ వాహన తనిఖీ అధికారులు హరి ప్రసాద్‌రావు, ఎస్. శ్రీనివాస యాదవ్, ఎస్ఐ రాజు తదితరులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

వైభవంగా నిత్య కల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సచివాలయాలతో ప్రజలకు మెరుగైన పరిపాలన

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 14వ వార్డులో నూతన సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను స్థాపించిందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్–1లో రూ.35.32 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ(1086251) భవనాన్ని బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో సచివాలయంపైన అదనపు అంతస్తులో నూతన సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన అందించాలని సదుద్దేశంతో సచివాలయాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రతి 1,000 నుంచి 1,500 ఇళ్లకు ఒక సచివాలయాన్ని స్థాపించారని, వాటికి ప్రభుత్వం భవనాలను సమకూర్చుతోందని తెలిపారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో కార్యదర్శులు స్నేహభావంతో మెలిగి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తద్వారా ఇటు సచివాలయ వ్యవస్థకు.. అటు ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. జగనన్న ఆశయాల సాధనకు ప్రతి కార్యదర్శి విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, పార్టీ మండల అధ్యక్షులు జి.వి. రమణి, కృష్ణారావు మాస్టార్, ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో లీజు హక్కులకు వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం లీజు హక్కులు ఖరారు చేయడానికి బుధవారం బహిరంగ వేలం, షీల్డ్ టెండర్లు ప్రక్రియ నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితికి కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని 1 నుంచి 20 షాపులు లీజు ఇచ్చేందుకు ఈ వేలం నిర్వహించారు. అలాగే సింహగిరి టోల్‌గేట్ వద్ద ఏడాది పాటు టికెట్ల వసూలు చేసుకునేందుకు నిర్వహించిన షీల్డ్ టెండర్ కోటి 20లక్షల 50వేలకు వేశారు. అలాగే సింహగిరిపై భక్తుల పాదరక్షలు భద్ర పరిచేందుకు వేసిన బహిరంగ వేలం పాట 36లక్షల 30వేలు హెచ్చుపాటకి వెళ్లింది. అలాగే సింహగిరిపై టీ కాఫీ మిషన్ ద్వారా విక్రయించుకోవడానికి నిర్వహించిన షీల్డ్ టెండర్ 30వేలకు వెళ్లింది. వీటిని ఈవో పరిశీలించి కమిషనర్ ఆమోదానికి పంపించాల్సి ఉంది. దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్‌లు వై.అప్పారావు, రాజ్యలక్ష్మి, గాయత్రి, ఉద్యోగులు దొంతల రమణ, చక్రవర్తి , దేవదాయశాఖ ఉద్యోగి నీలిమ వేలం పాటలు నిర్వహించారు.

25న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్


మింది జెడ్పీ హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 25వ తేదీన శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మింది వినాయక వేంకటేశ్వర సాయినాథ ఆలయ కమిటీ చైర్మన్ గుడివాడ నాగమణి తెలిపారు. ఈ మేరకు కల్యాణోత్సవం నిర్వహించనున్న పాఠశాల మైదానాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం 4.45 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 8.01 గంటల నుంచి ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

ఘనంగా ములాయంసింగ్ యాదవ్ జయంతి


ములాయంసింగ్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సీతంపేట: సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ 84వ జయంతి వేడుకలు బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. డాక్టర్ జాలాది విజయ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ముఖ్య అతిథి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు ములాయం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్ మనోహర్ లోహియా సిద్ధాంతాలు, స్ఫూర్తితో దేశంలో ఏర్పాటైన తొలి పార్టీ ఇదేనన్నారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీ నిర్మాణం చేస్తామని చెప్పారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. 7 ఉత్తరాంధ్ర జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిగా జాలాది విజయ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజా శ్రీనివాస్, లోకేష్ వర్మ, నారాయణరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.